## క్లుప్తంగా

### 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. తొలిరోజు చిన్నారులకు ఆటల పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం వంటి ప్రముఖులపై ఉపన్యాసాలు, 17న లఘునాటికలు, డ్రాయింగ్ పోటీలు, కవి సమ్మేళనం, 18న సీహెచ్ఆర్ చంద్రం రచించిన విదుర నీతిశతకం పుస్తకావిష్కరణ, 19న మహిళా చట్టాలపై అవగాహన సదస్సు, 20న ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

### 9న ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం



భట్లపెనుమర్రు(మొవ్వ): మండలంలోని భట్లపెనుమర్రులోని మల్లికార్జున పురంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో పునఃనిర్మించిన శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పోతురాజు స్థంభ ప్రతిష్ఠా మహోత్సవాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఆగమ సలహాదారు పరాశరం కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### ఎమ్మెల్యే డీఎన్నార్‌కు సత్కారం

కైకలూరు: రాష్ట్రంలో అక్రిడిటేషన్ అర్హత కలిగిన పాత్రికేయులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల కైకలూరు పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఇంటి వద్ద ఆయనను కలసి సోమవారం సన్మానించారు. ఇంటి స్థలాలు పొందని పాత్రికేయుల వివరాలను ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు నరహరశెట్టి శ్యాంబాబు, సుమంత్, రషీద్, పాల్‌రాజు, సీతారామయ్య పాల్గొన్నారు.

### ఎస్సీ శ్మశానవాటికను బాగుచేయాలి



మండవల్లి: మండవల్లిలోని ఎస్సీ శ్మశానవాటికలో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలగించి బాగుచేయాలని సామాజిక కార్యకర్త ఎల్ఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె. రాజ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీల శ్మశానభూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఉన్న భూమిలో ముళ్ల చెట్లు మొలిచి కాలినడక మార్గం కూడా సరిగా లేదని భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే జరిపించి ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలని కోరారు.

### ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ



నాగాయితిప్ప(మోపిదేవి): ఉద్యాన పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన అధికారి ఎస్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని నాగాయితిప్ప గ్రామంలో రైతులకు పంట సాగుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రైతులు ఫార్మర్ ఇంట్రస్ట్ గ్రూపు (ఎఫ్ఐజీ)గా ఏర్పడి ప్రభుత్వం ద్వారా రాయితీలు పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల పెంపకానికి సబ్సిడీ అందిస్తున్నామన్నారు. కొత్తగా అరటి, బొప్పాయి, జామ, కూరగాయలు సాగు చేసే రైతులు దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వ సబ్సిడీ పొందాలని చెప్పారు. గ్రామ ఎడ్వైజరీ బోర్డు చైర్మన్, సభ్యులు, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న 8 మంది అరెస్ట్

పెడన: మండల పరిధిలోని చేవేంద్ర గ్రామ సమీపంలో పేకాడుతున్న వారిపై పెడన పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి అందిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామని ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. పేకాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.20,770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# సుపరిపాలనకు నాంది పలికిన 'ప్రజాసంకల్ప యాత్ర'



కైకలూరు సంతమార్కెట్‌లోని వైఎస్ విగ్రహం వద్ద స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్



తోట్లవల్లూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

- ఎమ్మెల్సీ జయమంగళ ఎమ్మెల్యేలు కైలే, డీఎన్నార్
- ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు
- సంబరాలు నిర్వహించిన నేతలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తోట్లవల్లూరు: ప్రజా సంకల్పయాత్ర చేసి రాష్ట్రంలో సుపరిపాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య ఆయన సోమవారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రకు నేటికి ఆరేళ్లు పూర్తి చేసుకోవటం సంతోషంగా ఉందని అనిల్‌కుమార్ తెలిపారు. పాదయాత్రలో ప్రజల కష్ట, సుఖాలు తెలుసుకున్న జగనన్న ముఖ్యమంత్రి కాగానే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంతోపాటు ప్రజల అవసరాలకు తగినట్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకువెళుతున్నారని చెప్పారు.

**బస్సు యాత్రను విజయవంతం చేయండి..**

ఈ నెల 9న పామర్రులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ విషయమై మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నాయకులతో సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ యాత్రలో మంత్రి జోగి రమేష్, ఉప ముఖ్యమంత్రి ఆంజాద్ బాషా, ఎంపీ నందిగం సురేష్, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొంటారన్నారు. పదిహేను వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు పీఎస్ కోటేశ్వరరావు, మర్రెడ్డి శేషిరెడ్డి, నక్కా సత్యన్నారాయణ, దేవరపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**మున్ముందు మరింత మెరుగైన సంక్షేమం..**

గుడివాడ టౌన్: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తూ పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి 6 ఏళ్లయిన సందర్భంగా సంబరాలు చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు జగన్ మోహనరెడ్డి పాలనలో ప్రజలకు అందుతాయన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ కార్యదర్శి చింతల భాస్కరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, పార్టీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, వెంపటి సైమన్, తోట రాజేష్, తులిమిల్లి యేషయ్య, ఏలేటి విలియంజోషి పాల్గొన్నారు.

**దారి దీపంగా జగన్ పాదయాత్ర**
**కైకలూరులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ**

కైకలూరు: ప్రజా కంటక పాలనలో మగ్గుతున్న రాష్ట్ర ప్రజానీకానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన పాదయాత్ర ప్రజలకు దారిదీపం అయిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించి సోమవారంతో ఆరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కైకలూరు సంతమార్కెట్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్ విగ్రహానికి గజమాల అలంకరించి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు స్వయంగా గమనించి నవరత్నాలు వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. నవరత్నాలతో పరిమితం కాకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ పాదయాత్రలో ఆక్వా రైతులు సమస్యలు విన్నా జగన్ అధికారంలోకి రాగానే విద్యుత్ యూనిట్ రూ.1.50కి అందించారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు సీఎం జగన్ కొల్లేరు ప్రజలను అన్ని విధాల ఆదుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పలు మండలాల నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, కలిదిండి ఏఎంసీ చైర్మన్ ఐయినాల బ్రహ్మాజీరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు భట్రాజు శివాజీ, గోట్రూ ఏసుబాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, ఆదివిష్ణు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, శీలం రామకృష్ణ, బేతపూడి ఏసేబురాజు, వివిధ గ్రామాల సర్పంచులు దానం మేరీ నవరత్నకుమారి, ఉప్పలపాటి నాగమణి, జయమంగళ కాసులు, ఉలిసి వసంతకుమారి, కొయ్యే గంగయ్య, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఎస్.శ్యామ్‌సుందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, గంగుల అశోక్, నాయకులు హమీద్, రఫీ, సాయి, రవిప్రకాష్, ఈడే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా జనకంగా వరి సాగు



పామర్రులో కోతకు సిద్ధంగా వరి పైరు

పామర్రు: మండలంలో వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది 23, 500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. మండల పరిధిలోని 25 గ్రామాల పరిదిలో సాగుకు నీరు సక్రమంగా రావటంతో అనుకున్న సమయానికి కోతలు ప్రారంభించనున్నట్లు రైతులు చెబుతున్నారు. సాగు ఆలస్యంగా ప్రారంభమైన చోట్ల మాత్రం వారం, పది రోజుల్లో ఆ పొలాలు కూడా పక్వానికి వస్తాయని రైతులు వివరిస్తున్నారు. మండల పరిధిలోని బల్లిపర్రు, కురుమద్దాలి, కనుమూరు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లో వరి పంట పక్వానికి వచ్చింది. వారం రోజుల్లో కోతలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంట కాలువ చివరి భూముల్లో పంట కోతకు రావటానికి సమయం పడుతుందని రైతులు అంటున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా ఉందని, తుఫాన్ లాంటివి రాకుండా ఉంటే ఈ ఖరీఫ్ గట్టెక్కుతామని రైతులు అంటున్నారు.

**అపరాల సాగుకు సిద్ధం..**

మండల పరిధిలోని కాలువ ఎగువ ఉన్న రైతులు ఇప్పటికే అపరాలు వెదజల్లుతున్నారు. సాగు నీటి కొరత లేక పోవడం వల్ల దాళ్వా వరి సాగు ఉండే అవకాశం ఉండటంతో కొందరు రైతులు దాళ్వా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తే తప్ప దాళ్వా వరి సాగు చేయలేమని రైతులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



మండవల్లిలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయిస్తున్న సిబ్బంది

మండవల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలను ప్రారంభించారు. కాంతమ్మ, సీఆర్పీ నాగవిజయ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పేర్కొన్నారు. వినియోగదారులు ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారని మంచి స్పందన లభిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్పీ నాగవాణి, నళిని, ఉషారాణి, రామారావు పాల్గొన్నారు.

## 'ఉపాధి' కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి

పమిడిముక్కల: 2023–24 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎంపీడీఓ విఠల్‌పాల్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ విఠల్‌పాల్ మాట్లాడుతూ 17 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు విజయవంతంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సభల్లో ప్రతిపాదనలు ఇవ్వాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈవోఆర్డీ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 వేల చొప్పున ఇస్తున్నారని, గ్రామాల నుంచి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని కార్యదర్శులకు సూచించారు. రీసర్వేకు రైతులంతా సహకరించాలని డీటీ యేసుపాదం కోరారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూడాలని ధూళిపూడిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు రమేష్ కోరారు. జగనన్న పాల వెల్లువ రుణాలిచ్చేందుకు కేడీసీసీ బ్యాంక్‌లలో నిబంధనలు కఠినతరంగా ఉన్నాయని, వేరే బ్యాంకులకు మార్చాలని కోరారు. చోరగుడి–గోపాలకృష్ణాపురం మధ్య విద్యుత్ స్తంభాలు విరిగి, ఒరిగిపోయి ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి రమణ తెలిపారు. వెంటనే సరిచేయిస్తానని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న లేఅవుట్లలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక లైన్లు వేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 387 మంది రక్తహీనత ఉన్న పిల్లలున్నారని, వారికి ఐరన్ ట్యాబ్లెట్స్ ఇస్తున్నామని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించామన్నారు. వేదికపై వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్ ఉన్నారు. ఏఈలు శరాబందిరాజు, భవానీప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుంతీదేవికి ఎమ్మెల్యే కైలే పూజలు



కుంతీదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కైలే

తోట్లవల్లూరు: యాకమూరులో కుంతీదేవి పండగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కుంతీదేవి అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. పండగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


## హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు పురస్కరించుకుని సోమవారం అమ్మవారిని హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభించారు. శక్తి వేషదారణలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపు అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్యామలాంబ, రామలింగేశ్వర, వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు, బొప్పన శివకుమార్, నాయకులు నిమ్మల సాయి, వసుంధర మురళీ, జంపన రాము, తులసి పూర్ణ, బుసనబోయిన శ్రీను, కటికల రఘు, మద్దూరి దుర్గాప్రసాద్, పోలవరపు శ్రీనివాసరావు, సమతం శ్రీనివాసరావు, కట్టా శ్రీనివాసరావు, పంజా నాగు, సమయం వీరాంజనేయులు, సాన శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త మండలి, ఉత్సవ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 9 వరకు ఓట్ల నమోదు



రాజ్‌కుమార్, తహసీల్దార్

మండవల్లి: 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన, నిండుతున్న వారు 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ కె. రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 4, 5 తేదీలలో జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం, డిసెంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతుందని, బీఎల్వోలు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన వారు ఓటరుగా నమోదు కావాలని పేర్కొన్నారు.

# బాణసంచా గోడౌన్ల తనిఖీ



టపాసుల విక్రయదారుడికి సూచనలిస్తున్న పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారులు



పెదపారుపూడిలో బాణసంచా నిల్వలను పరిశీలిస్తున్న ఎస్ఐ పల్లా నాగకల్యాణి

గుడివాడరూరల్: అధికారుల అనుమతులతోనే టపాసులు విక్రయించాలని గుడివాడరూరల్ సీఐ ఏసోబు, తహసీల్దార్ కె.ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన టపాసుల హోల్‌సేల్ విక్రయ గోడౌన్‌ను పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయదారుడి లైసెన్స్, ఇతర పత్రాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీఐ, తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, కలెక్టర్ రాజాబాబుల ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మకాలు సాగించే బాణసంచా విక్రయ గోడౌన్‌ల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. లేనిపక్షంలో పెనుప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిలో భాగంగానే టపాసుల గోడౌన్‌లను సందర్శించి నిర్వాహకులు తీసుకున్న జాగ్రత్తలను పరిశీలిస్తున్నామన్నారు. జాగ్రత్తలు తీసుకోనివారికి సూచనలు ఇచ్చారు. నిబంధనలకు లోబడి విక్రయాలు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి, రూరల్ ఎస్ఐ ఎల్ఎస్ఎస్ మూర్తి, రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదపారుపూడి: స్థానిక మందుగుండు షాపులను సోమవారం పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. బాణసంచా నాణ్యత, పాత సరుకు, కొత్త సరుకు నిల్వలను ఎస్ఐ పల్లా నాగకల్యాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దీపావళి పండగ ప్రాణతకం కాకూడదని, వ్యాపారులు అందరూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పాస్ బుక్ ఇవ్వాలని 'స్పందన'లో వినతి



కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న మహిళ

గుడివాడ టౌన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. నందివాడ మండలం తమిరిశ గ్రామం నుంచి జి.రజినీకుమారి, ఇతరులు తమ అసైన్డ్ భూమిని 22ఏ నుంచి తొలగించి పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరారు. బేతవోలు ఇందిరా నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ తదితరులు స్థానిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చర్చిని తొలగించాలని కోరారని ఆర్డీఓ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశపు హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రధానంగా స్థానిక 11వ వార్డులో మురుగునీటి సమస్య తలెత్తిందని, ఇళ్ల స్థలాల మార్పిడి విషయంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలంటూ మరొక లబ్ధిదారు అర్జీ అందజేశారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వీటికి సంబంధించి ఆయా శాఖలకు దరఖాస్తులు పంపి సత్వర పరిష్కారం చేస్తామన్నారు.

## సచివాలయ భవనం ప్రారంభం



ఆచవరంలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశ చరిత్రలో విప్లవాత్మక పరిణామమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కొనియాడారు. ఆచవరం గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సొంత గ్రామంలోనే ప్రభుత్వ సేవలు ఇంటి గుమ్మం వద్దకు చేరుతున్నాయన్నారు. ప్రజలు సీఎం జగన్ పాలనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, వివిధ గ్రామాల సర్పంచులు కట్టా నాగరాజ్ గౌడ్, సంకు కోటేశ్వరరావు, ధర్మరాజుల నాగమణి, ఉలిసి వసంత కుమారి, ఉప్పలపాటి నాగమణి, నున్న రాంబాబు, ఎంపీటీసీ బుర్ల నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోడావుల శ్రీనివాసరావు, నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు, ఉలిసి శ్రీనివాసరావు, మాడపాటి చింతయ్య, మీగడ సత్యనారాయణ, సోబుల సత్యనారాయణ, బుర్ల పోతురాజు, చేవేటి యేసేబు, సన్నిధి కృష్ణ, బుర్ల కిరణ్, పుత్తూరు వెంకటేశ్వరరావు, తలారి సీతారామయ్య, కొడవలి రాజా, పంతగాని ప్రసాద్, పంది నాగేశ్వరరావు, బుర్ల వేణుగోపాల స్వామి, నీలపాల వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

## రామాలయ కల్యాణ మండపం పునఃప్రారంభం



భద్రిరాజుపాలెంలో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెం గ్రామస్తులు రామాలయ కల్యాణ మండపాన్ని సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సూచించారు. గ్రామంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానానికి సంబంధించిన కల్యాణ మండపం గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకోవటంతో గత కొన్నేళ్లుగా వివాదంలో చిక్కుకుంది. దీనిపై ఆలయ కమిటీ గత ఏడేళ్లుగా పోరాటం సాగిస్తోంది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కృషితో ఎట్టకేలకు దేవదాయశాఖ అధికారులు కల్యాణ మండపాన్ని రామాలయానికే కేటాయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సోమవారం సాయంత్రం పునఃప్రారంభించారు. కల్యాణ మండపానికి సంబంధించిన పత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ల వీరప్రతాపరెడ్డికి ఆయన అందజేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, పీఏసీఎస్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి,ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 119 దరఖాస్తుల స్వీకరణ

మొవ్వ: ఈ నెల 4, 5 తేదీల్లో మండలంలోని 21 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాల ద్వారా 119 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. నూతన ఓటు కోసం (ఫారం–6) 61 మంది, తొలగింపు కోసం (ఫారం–7)కు 40 మంది, మార్పుల కోసం (ఫారం–8) 18 మంది దరఖాస్తులు అందించినట్లు వివరించారు. ఈ ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను తిరిగి డిసెంబర్2, 3 తారీకుల్లో నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**దస్తావేజులు పోయినవి**

ది. 2-11-2023 మోపర్రు గ్రామము నుండి పెదపారుపూడి జిరాక్స్ తీసుకోవడానికి ఆటోలో వెళ్ళుచుండగా ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం. 2410/1983 రీ.స. నెం. 613-5201లో ఎ.0.17ట్లు రీ.సెం. నెం. 6/3బిలో య. 15ట్లు వెరశి య. 0.55 ట్లు. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.
తిరుమలశెట్టి కృష్ణ బాయమ్మ
W/o. సుబ్బారావు (లేటు)
డోర్ నెం. 61-17-2/1, రామలింగేశ్వరనగర్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా.
ఫోన్ : 94400 29381

## 10న పాటల పోటీలు

పామర్రు: ఘంటసాల ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 10న మండల స్థాయిలో పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాటల పోటీలను నిర్వహించి అనంతరం బహుమతులు అందజేస్తామన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు జూనియర్స్ విభాగం, 8 నుంచి 10వ తరగతి వరకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ముఖ్యఅతిథిగా పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుభాకర్ హాజరవుతారని తెలిపారు.

## 13 నుంచి ఆకాశ దీపారాధన

మండవల్లి: కార్తిక మాసం సందర్భంగా అల్లినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీ నుంచి ఆకాశ దీపారాధన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు సుదర్శనం గౌతమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ చేయించుకునే భక్తులు ముందుగా గోత్ర నామాలు ఆలయం వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com